

చెహోవ్ కథ

# ప్రేమ భాష

రష్యన్ మూలం: చెహోవ్.
తెలుగు గొంతు: కరుణారుణ

మధ్యాహ్నం ఒంటిగంట. బట్టల దుకాణంలో రద్దీగా వున్నది. సేల్స్‌మెన్, సేల్స్ గర్ల్స్ నోటికి క్షణం విరామం యివ్వక ఏదో వాగుతూనే వున్నారు. అందరూ మాట్లాడుతూనే వున్నారు గాని ఏమీ వినిపించడం లేదు. రొద. టీచరు పిల్లల్ని పాఠం బట్టీపట్టమంటే దీర్ఘాలుతీస్తూ చదువుతుంటారే, అలాగ శబ్దం.

డ్రెస్సులు కుట్టి అమ్మే ముసలావిడ కూతురు పోలింకా హాలుమధ్యలో నిలుచుని ఎవరికోసమో వెదుకుతున్నది.

"ఏం కావాలి?" అంటూ పలికాడు కౌంటర్లో సేల్స్‌మేన్.

"నికొలాయ్ ఎక్కడ? నాక్కావలసినవన్నీ అతడే యిస్తాడు."

నికొలాయ్ తన కౌంటర్ మీది బట్టల కుప్పలు తొలగించి నవ్వుతూ,

"గుడ్‌మార్నింగ్ మేడం, వెల్కం." అంటూ ఆహ్వానించాడు.

"ఆఁ. ఏం కావాలీ?" అంటూ తల్లి పురమాయించినవి ఒక్కొక్కటే జ్ఞాపకం చేసుకుంటూ,

"మస్లిన్ గుడ్డ చూపించండి." అంది పోలింకా.

"ఎందుకూ? ఏం కుడతారు?"

"బాడిస్ ట్రిమ్మింగ్ చెయ్యటానికి. బాడిస్ ఒక్కటే కాదు. మొత్తం డ్రెస్సు."

నికొలాయ్ రంగు రంగుల మస్లిన్ గుడ్డల కట్టలు కౌంటర్ మీద పరిచాడు. గుడ్డను చేత్తో పట్టుకొని పరీక్షిస్తూ బేరం మొదలెట్టింది పోలింకా.

"దీని ధర రూబుల్ కన్నా తగ్గదండి. ఇది సుపీరియర్ క్వాలిటీ. ఇంపోర్టెడ్ ఫ్రం ఫ్రాన్స్. ఇందులోనే కాస్త తక్కువ రకం మెటీరియల్ కూడా వుంది. చూస్తారా. అది నలభై అయిదు కోపెక్కులకే గజం." అంటాడు సేల్స్‌మాన్.

"నాకింకా క్రేపు గుడ్డా, దంతపు గుండీలూ, బీడ్స్ కూడా కావాలి."


"ఓ యస్."

పోలింకా కౌంటర్ మీదికి వంగి, గుసగుసగా,

"గురువారంనాడు అంత త్వరగా ఎందుకెళ్లిపోయావు?" అంటుంది.

"నీకంత జ్ఞాపకమున్నందుకు సంతోషం. నువ్వా స్టూడెంట్ కుర్రాడితో కబుర్లు చెబుతున్నావు. నాతో నీకేమవసరమని వచ్చేశాను."

బుగ్గలు ఎరుపెక్కగా పోలింకా కళ్లు వాల్చుకుంటుంది. నికొలాయ్ డబ్బాలన్నీ మూతపెట్టి ఒకదానిపైన ఒకటి పేరుస్తాడు. క్షణం నిశ్శబ్దం.



"బీడ్స్ కేస్ ఏదీ?" పోలింకా నికొలాయ్ వైపు భయంగా చూస్తూ.

"ఏ రంగు లేస్ కావాలి? నలుపా? ఎరుపా? ఇదుగో, ఇది చూడండి. ప్రస్తుతం యిదే ఫాషన్."

"ఎంత?"

"నలుపైతే ఎనభై కోపెక్కులు. ఇది రెండున్నర రూబుళ్లు.... నేనింకెప్పుడూ నీకోసం రాను." అంటాడు నికొలాయ్ నెమ్మదిగా.

"ఎందుకు?"

"ఎందుకు రావాలసలు? నువ్వా స్టూడెంటుగాడితో విరగబడి నవ్వుతూ కూర్చుంటే చూడటానికి నేను రావాలా ఏమిటి? నేనంత మూర్ఖుణ్ణనుకున్నావా? ఎంత వెధవనైనా నాకూ అన్నీ అర్థమవుతాయి. ఎన్నాళ్లుగా వాడు నీ వెంట పడుతున్నాడో గమనించ లేదా ఏమిటి? వాడొచ్చాడంటే నీకీ లోకంలో మరో మనిషి కనిపించడు. నువ్వు వాణ్ణి లవ్ చేస్తున్నావ్. వాడే హీరో. నేనెందుకు మధ్య పుడకలాగ."

కన్నీళ్లాపుకుంటూ పోలింకా కౌంటర్ మీది గుడ్డను నలుపుతూ వుంటుంది.

"నేనంత ఆత్మాభిమానం లేని వాణ్ణేం కాను. వాడే కావాలని నువ్వు డిసైడ్ చేసుకున్నావు. ఇక మళ్లీ జీవితంలో నీ గురించి ఆలోచిస్తే ఒట్టు... ఇంకా ఏమేం కావాలో చెప్పండి మేడం!"

మమ్మీ పెద్ద లిస్టే చెప్పింది. మరిచిపోయాను. ట్రిమ్మింగ్ మెటీరియల్ చూపించండి."

"ఎలాంటిది కావాలి?"

"బెస్ట్ క్వాలిటీ. లేటెస్ట్ ఫ్యాషన్."

ఇదిగో, ఇదీ యిప్పుడు డిమాండ్‌లో వున్నది. ఇంక కలర్స్ అంటారా, పసుపు రంగు అందరూ అడుగుతున్నారు. ఇందులో మళ్లీ రెండు మూడు క్వాలిటీలున్నాయి... నువ్వు వాడితో ప్రేమలో పడ్డావ్. వాడెలాంటి వాడో నాకు తెలుసు. అలాంటి దుర్మార్గుల వలలోపడ్డ వాళ్లు ఏమైపోతారో తెలుసా..."

నికొలాయ్ కళ్లు ఎరుపెక్కుతాయి. గుడ్డలు మడతపెడుతూ, మళ్లీ ఓపెన్ చేస్తూ బిజీగా వున్నట్లు నటిస్తాడు.

"వాడు నిన్ను పెళ్లిచేసుకుంటాడనే ఆశ. అవసరం తీరగానే వాడు నిన్ను నట్టేట ముంచటం ఖాయం. నంబర్‌వన్ చీట్. బాగా టోకరా వేశాడు. వాళ్లకు డబ్బు టెక్కు ఎంతుంటుందనుకున్నావు? వాళ్లకు మనం అసలు మనుషుల్లాగే కనిపించం. నోటు చూపితే ఏమైనా చేస్తామనుకుంటారు.

... ఇంతకూ ఏ ట్రిమ్మింగ్ మెటీరియల్ కావాలో చెప్పండి. రెండురోజులాగు. వాడి మురిపెం తీరగానే నిన్నేం చేస్తాడో తెలుస్తుంది. కొన్నాళ్లు పోయాక వాడు ఏ డాక్టరో, లాయరో అవుతాడు. అప్పుడు వాడు నిన్ను దగ్గరకు రానిస్తాడా? "ఆ రోజుల్లో ఓ పిల్లతో బలే ఆడుకున్నాను. ఇప్పుడెక్కడుందో అది." అని చెప్పుకుంటాడు. తన ఫ్రెండ్సుతో ఇప్పుడు కూడా చెప్పుకోడా ఏమిటి?

"ఓ బలే పిట్ట దొరికిందిరా" అంటూ.

దుఃఖాన్నీ, అవమానాన్నీ భరించలేక పోలింకా కౌంటర్ మీది అట్టడబ్బాలను చూస్తూ నిల్చుంటుంది.

" ఈ ట్రిమ్మింగ్ గుడ్డ వద్దు. మమ్మీ వచ్చి స్వయంగా సెలెక్టు చేసుకుంటుందిలే. ఓవర్‌కోట్ కోసం ఒక ఆరుగజాల గుడ్డకావాలి. నలభై కోపెక్కులకు గజం గుడ్డ వుంది. చూడండి. అది కావాలి. దానికి షెల్ బటన్స్ కావాలి.

నికొలాయ్ కౌంటర్ మీది డబ్బాలన్నీ తీసి షెల్ఫులో పెడతాడు అతడింకా ఏమన్నా చెబుతాడేమోనని పోలింకా నిరీక్షిస్తుంది. కాని నికోలాయ్ పనిలో నిమగ్నమవుతాడు.

"డ్రెస్సింగ్ గౌన్ బటన్స్ కూడా కావాలి." అంటుంది పోలింకా నెమ్మదిగా కర్చీఫ్‌తో పెదాల్ని తుడుచుకుంటూ.

"ఎలాంటివి?"

"కాస్త ఖరీదైనవే కావాలి. ఫ్యాషనబుల్‌గా వుండాలి."

"ఇవిగో, ఇవి చూడండి. బెస్ట్ క్వాలిటీ. రెడ్, బ్లూ, గోల్డ్ కలర్. బ్రైట్ కలర్ గౌన్ మీదికి డల్ బ్లాక్ బాగుంటుంది... నీ అంత మూర్ఖురాల్ని ఎక్కడా చూడలేదు. వాడు నీ పుట్టి ముంచడం ఖాయం."

"నిజమే నికొలాయ్. నాకూ యిప్పుడిప్పుడే పరిస్థితి అర్థమవుతున్నది." అంటుంది పోలింకా గుసగుసగా.

ఓ లావుపాటి మనిషి కౌంటర్ వెనక నికొలాయ్‌ను రాసుకుంటూ పోతాడు." పోలింకావైపు చూస్తూ.

"నా కౌంటర్‌కు కూడా రండి మేడం. కొత్త వెరైటీ జెర్సీ కోట్లు వచ్చాయి. ఒక్కసారి

"వాడు నిన్ను పెళ్లిచేసుకుంటాడనే ఆశ. అవసరం తీరగానే వాడు నిన్ను నట్టేట ముంచటం ఖాయం. నంబర్‌వన్ చీట్. బాగా టోకరా వేశాడు. వాళ్లకు డబ్బు టెక్కు ఎంతుంటుందనుకున్నావు? వాళ్లకు మనం అసలు మనుషుల్లాగే కనిపించం. నోటు చూపితే ఏమైనా చేస్తామనుకుంటారు."

చూడండి." అంటాడు.

"కుట్టు కనిపించకూడదు. ట్రేడ్ మార్క్ స్పష్టంగా వుండాలి."

అంటుంది ఒక మధ్య వయస్కురాలు జెర్సీ కోట్లవైపు చూస్తూ.

"అలా నిల్చోకు. ఏదో ఒకటి సెలెక్టు చేస్తున్నట్టు వుండు." అంటాడు నికొలాయ్ బలవంతంగా నవ్వుతూ.

"మొహం అలా పాలిపోయిందేం? ఎలా చూసినా వాణ్ణి నమ్ముకుం... బతుకు కుక్కబతుకే. డబ్బుంటే వాడు నిన్ను వాడుకొని వదిలేస్తాడు. డబ్బు లేకపోతే నిన్ను కట్నం కోసం చేసుకుంటాడు. అప్పుడైనా నీతో జీవితాంతం కాపురం చేస్తాడనుకోకు. నీకు చదువురాదు. తన పెళ్లానికి చదువురాదని ఫ్రెండ్సుకు తెలియడం వాడికిష్టం వుండదు. వాళ్లది హై సొసైటీ. దర్జీ కూతురివి నువ్వు."

దూరంగా వున్న కౌంటర్ నించి ఎవరో అరుస్తారు.

"నికొలాయ్, మూడు గజాల రిబ్బన్ కావాలి. పంపించు."

"ఉంది. ఇదిగో."

"అరే. మర్చేపోయాను. ఓ జత బెల్ట్ బకిల్స్ కావాలి." అంటుంది పోలింకా.

"ఏడుస్తున్నావెందుకూ? ఛ. అందరూ ఏమనుకుంటారు. ఆ స్క్రీన్ వెనక్కు పద. అక్కడెవరూ చూడరు." నికొలాయ్ ఆమెను ఆడవాళ్ల అండర్‌వేర్స్ అమ్మే గదివైపు తీసికెడతాడు.

"ఏం కావాలి? మొదట కళ్లు తుడుచుకో."

"నడుం సైజు నలభై ఎనిమిది సెంటీమీటర్లు... నికొలాయ్, ఇవ్వాళ ఒక్కసారి రావూ. నీకో విషయం చెప్పాలి."

"నువ్వు, చెప్పేదీ లేదు. నేను వినేదీ లేదు. అంతా అయిపోయింది."

"నువ్వు తప్ప నాకెవరున్నారు. నికొలాయ్ ప్లీజ్! ఈ ఒక్కరోజు రావూ."

"ఇదిగో, ఈ మెటీరియల్ ఎలా వుంది?... మన మధ్య మాట్లాడటానికేమీ లేదు. ఇవ్వాళ వాడితో ప్రోగ్రాం లేదేమిటి?"

"అతడూ వస్తాడులే."

"మరింక నేనెందుకు? వాడికీ నీకూ లవ్వూ..."

"అవును." అంటుంది పోలింకా. కన్నీళ్లు జలజలా రాలుతాయి.

"గుడ్‌లక్. నాకంత స్వార్థమేమీ లేదు. నువ్వు సుఖంగా వుంటే అంతే చాలు."

పొడుగాటి మరో సేల్స్‌మాన్, అట్టడబ్బాల గుట్టలను పక్కకుతోస్తూ.

"మీకు మంచి ఎలాస్టిక్ గార్టర్ చూపిస్తాను రండి. ఇదెంతో ఆరోగ్యకరం. మెడికల్ డిపార్టుమెంటువాళ్లు దీన్ని సర్టిఫై చేశారు." అంటూ ఓ కష్టమర్ను తీసుకొస్తాడు.

పోలింకాను స్క్రీన్ వెనక్కు తోసి నికొలాయ్.

రెండు రకాల కేసులున్నాయి మేడం. ఒకటి కాటన్‌ది. ఒకటి సిల్కుది. ఒక్కొక్క దాంట్లో మళ్లీ అనేక రకాలు. పెర్షియన్, క్రోషె, ఇంగ్లీష్, టార్చాన్ ఇవన్నీ కాటన్.

కో కో కో, సూటాక్, కాంబ్రే ఇవన్నీ సిల్కు... మొదట కళ్లు తుడుచుకో. ఎవరైనా చూస్తారు. అదిగో, ఎవరో వస్తున్నారు."

కన్నీరు ఆగలేదు సరికదా పోలింకా వెక్కి వెక్కి ఏడ్చింది. నికొలాయ్, గొంతు పెంచి,

"స్పానిష్, కొ కో కో, సూటాక్, కాంబ్రే... మేజోళ్లు, దారం, కాటన్, సిల్క్..." అంటూ అరుస్తూనే వున్నాడు. ■